క్లుప్తంగా

యంత్రాల సాయంతో వరి నూర్పిళ్లు



పామర్రు: పామర్రులో యంత్రాల సాయంతో వరి నూర్పిళ్లు చేపట్టారు. యంత్రాల వలన సమయం, నగదు ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా కూలీల సమస్యకు కూడా చెక్ పెట్టవచ్చని పేర్కొంటున్నారు. వరి నూర్పిడి యంత్రం ద్వారా ఎకరానికి సుమారు రూ.4,500 మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. అదే కూలీలతో కోతలు కోసి, కుప్ప వేసి నూర్పిస్తే ఎకరానికి సుమారు రూ.6వేల వరకు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శాంతి వృద్ధుల ఆశ్రమం, కరుణాపీఠం వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలం వచ్చిన సందర్భంగా వృద్ధుల సౌకర్యార్థం ఈ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎల్వీ లక్ష్మీ నరసింహమూర్తి – ప్రణీత దంపతుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వాహించామన్నారు. కార్యక్రమంలో పుట్టి హరికుమార్, బొగ్గారపు తిరుపతయ్య, కె. హరిబాబు, జాజుల తాతారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ఎంఈఓ కె.నరేష్‌కుమార్‌కు ఏపీటీఎఫ్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు బేతాళ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆదాయపు పన్నుకు సంబంధించి టీడీఎస్ చెల్లించే విధానాన్ని ఉపాధ్యాయులకు వివరంగా తెలియజేయాలన్నారు. ప్రతి నెలా నిర్వహించే కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధించి సమాచారాన్ని మండల కార్యాలయం నుంచి ఉపాధ్యాయులకు సకాలంలో అందించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



ముదినేపల్లి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేసిన కూరగాయలను సోమవారం విక్రయించారు. ప్రతి సోమవారం ముదినేపల్లిలో వారపు సంత జరుగుతుంది. వినియోగదారులను ఆకర్షించేందుకు ఈ కూరగాయలను ప్రతి వారం విక్రయించనున్నట్టు అధికారులు తెలిపారు. మండలంలోని బొమ్మినంపాడు, కొరగుంటపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఈ కూరగాయలు, ఆకుకూరలను పండించి విక్రయిస్తున్నట్లు ఈ–సాగు మండల ఇన్‌చార్జి గౌతమ్ కుమార్ తెలిపారు. వీటితో పాటు గిరిజన కార్పొరేషన్ నుంచి సేకరించిన బెల్లం, కారం, పసుపు వంటి ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు మొవ్వ విద్యార్థినులు



మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ (బైపీసీ) మొదటి సంవత్సరం విద్యార్థిని జోగి లక్ష్మీదుశ్రీ విజయవాడ పటమట ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే (ఏపీ మార్షల్ ఆర్ట్స్) పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, బంగారు పతకాన్ని పొందింది. హర్యానాలో డిసెంబర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డి.సుధాకరరావు పేర్కొన్నారు. అలాగే ఇదే పోటీల్లో కళాశాల విద్యార్థిని అసలేటి భాను తేజశ్రీ రెండో స్థానంలో నిలిచి రజిత పతకాన్ని పొందినట్లు తెలిపారు. వీరిద్దరినీ వృత్తి విద్యా కోర్స్ అధ్యాపకులు ఆనంద్, గ్రంథాలయ పాలకులు సర్వారెడ్డి సోమవారం కళాశాల ప్రాంగణంలో అభినందించారు.

ఉచిత గ్యాస్ ఉత్తిదేనా..!

● 'దీపం'పై మహిళల కన్నెర్ర ● బ్యాంకు ఖాతాలకు జమ కాని గ్యాస్ సొమ్ము

కూటమి నాయకుల హామీలు నీటి మూటలే అని మహిళలు విమర్శిస్తున్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదునెలల తర్వాత ఆర్భాటంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. గ్యాస్ సిలిండర్ నగదు బ్యాంక్ ఖాతాలో జమ కావడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.



గ్యాస్ సిలిండర్లు

గుడ్లవల్లేరు: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన దీపం పథకానికి సంబంధించిన నిబంధనలపై మహిళలు కన్నెర్రజేసి వ్యతిరేకిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ పొందిన 48 గంటల తర్వాత కూడా రకరకాల సాకులతో అర్హుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ కాకపోవటంతో మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మొండి చేయి చూపేందుకే గతంలో మాదిరిగా అర్హులకు మేలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం మోకాలు అడ్డుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయని ఆరోపిస్తున్నారు.

13 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు

గుడ్లవల్లేరు మండలంలో ఇండియన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి 13 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్లలో అర్హులైన వినియోగదారులకు గ్యాస్ సిలిండర్‌కు సొమ్ము చెల్లించి తీసుకున్నా బ్యాంకు ఖాతాల్లోకి ఎన్ని రోజులైనా చాలామంది అర్హులకు ప్రభుత్వం సొమ్ము జమ చేయటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చంద్రబాబు ఎన్నికల హామీ ఇలా..

ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చేటపుడు కేవలం తెల్ల రేషనుకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీలో 48 గంటల్లో లబ్ధి చేకూరుస్తానని ఎక్కడా ఆయన ప్రస్తావించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత గ్యాస్ పంపిణీపై కొత్త నిబంధనలు పెడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ 48 గంటలు అనే మాట ఇప్పుడు అంటున్నారు తప్ప.. గతంలో చెప్పలేదని విమర్శిస్తున్నారు. ముందుగా డబ్బు చెల్లించాలనేది కూడా కొత్త నిబంధనే. ఆ హామీ మేరకు అయినా 48 గంటలు కాదు కదా.. 10 రోజులకైనా సొమ్ము చెల్లించి గ్యాస్ పొందిన అర్హులకు బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కావటం లేదు. ఇదేమిటని గ్యాస్ ఏజెన్సీలను అడిగితే ఈకేవైసీ చేయించుకోవాలని, ఫోను నంబర్ మార్చుకోవాలని, రక రకాల సాకులు చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

దీపావళికి గ్యాస్ తీసుకున్నా..



దీపావళికి నీకు ఉచిత గ్యాస్ వచ్చిందని రమ్మని పిలిపించారు. అయితే డబ్బులు కట్టాకే సిలిండర్ తీసుకోమన్నారు. నేను కట్టిన డబ్బులు వెంటనే నా బ్యాంకు ఖాతాలో పడతాయని అధికారులు చెప్పారు. ఆ పండుగ రోజు నుంచి ఇప్పటి వరకూ ఎదురు చూస్తున్నా. నా బ్యాంకు ఖాతాలో నగదు జమ కాలేదు.
– ఎస్.సుందరమ్మ, చిత్రం, గుడ్లవల్లేరు మండలం

అన్నీ అబద్ధపు హామీలే



చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలే. అందులో ఉచిత గ్యాస్ పంపిణీ ఒకటి. హామీ ఇచ్చినపుడు తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక ముందు డబ్బు కట్టమంటున్నారు. నగదు చెల్లించాక 48 గంటలు అని చెప్పారు. ఇపుడేమో 20 రోజులైనా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కావడంలేదు.
– పిడుగు దేవసహాయం, గుడ్లవల్లేరు మండల సీపీఎం నాయకుడు

ఈకేవైసీ తప్పనిసరి

నగదు చెల్లించి గ్యాస్ సిలిండర్ పొందే వారిలో అర్హులందరూ ముందుగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సిందే. అప్పుడే వారికి గ్యాస్ సిలిండర్ తీసుకున్న తర్వాత సొమ్ము వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతుంది. బ్యాంకు అకౌంట్‌తో పాటు పాన్, ఆధార్ కార్డులతో సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి.
– కిరణ్, పీడీఎస్ డీటీ

ఆలయాలకు కార్తిక శోభ



పామర్రు సోమేశ్వరస్వామి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



గుడివాడలో భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

పామర్రు: కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో శైవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దీపాలను వెలిగించి పూజలను చేశారు. తొలుత ఆల యంలో స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో పూజలను లంకా భీష్మ ఆ ధ్వర్యంలో సహాయకులుగా బి.ఫణికుమార్ నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కందు ల వెంకటరెడ్డి, సిబ్బంది ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం(పెద్ద శివాలయం), గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకర స్వామి దేవస్థానం(చిన్న శివాలయం), బేతవోలులోని శ్రీ ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం కార్తిక పూజలు జరిగాయి. ఈ ఏడాదికి చివరి కార్తిక సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని గుడ్లవల్లేరు కన్యకా పరమేశ్వరీ దేవి పంచాయతన క్షేత్రంలో సహస్ర లింగార్చనతో పాటు అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కంతేటి సుబ్బారావు, ముప్పిడి హేమంత్, కె.వెంకటేశ్వరరావు, అనిల్, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి సోమవారం వేకువజాము నాలుగు గంటల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పత్యేక పూజలు చేశారు.

కలిదిండిలో..

కలిదిండి(కైకలూరు): ప్రజలు ఆధ్మాత్మిక చింతనతో



కలిదిండి రాజలింగేశ్వరస్వామి ఆలయంలో డీఎన్నార్

మానసిక ప్రశాంతత పొందాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కలిదిండి రాజలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం కార్తీక దీపోత్సవం, లక్షపత్రి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డీఎన్నార్ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పెటేటి నాంచారయ్య, వడుపు భోగేశ్వరరావు, పోతురాజు లక్ష్మణరావు, మంగిన భాస్కర్, పోతురాజు హరికృష్ణ, సమయం శ్రీను పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ దేవస్థానంలో ప్రాంగణంలోని రామేశ్వర, రామలింగేశ్వర, కనకలింగేశ్వర ఆలయాల్లో సోమవారం ఉదయం, రాత్రి భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఈఓ వీఎన్కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆటపాక కనకలింగేశ్వరస్వామి, కలిదిండి, కోరుకొల్లు శివాలయాల్లో భక్తులు కార్తిక పూజలు చేశారు.

మండవల్లిలో..

మండవల్లి: లింగాల విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. మండవల్లిలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గుడ్లవల్లేరులో సహస్ర లింగార్చన



లింగాల విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భారత రాజ్యాంగంపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి

కలిదిండి(కైకలూరు): భారత రాజ్యాంగం విశిష్టతపై విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి పేర్కొన్నారు. జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా కలిదిండి మండలం ఆరుతెగళ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో సోమవారం విద్యార్థులకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందన్నారు. ప్రాథమిక హక్కులు, పౌర విధులను విద్యార్థులకు వివరించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఎటువంటి ర్యాగింగ్‌లకు పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో కైకలూరు ప్యానల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్, డి.శివప్రసాద్, ఏఎస్ఐ కె.వెంకటేశ్వరావు, హెచ్ఎం శ్రీనివాస్, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

గురజాడ రచనలు ఆదర్శనీయం



శివరామకృష్ణమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: సమసమాజ హితం కోసం దూరదృష్టితో గురజాడ వెంకట అప్పారావు రచనలు సాగాయని వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో భారతీ సమితి సర్వసభ్య సమావేశంలో గురజాడ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఉపన్యాసకులు వీవీ శివరామకృష్ణమూర్తి మాట్లాడుతూ గురజాడ రచనల్లో సమాజం, సామాజికం, మానవీయ కోణాలు దాగి ఉండేవన్నారు. అవి వ్యక్తిగత జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంతో పాటు సామాజిక విప్లవానికి నాంది పలికాయని కొనియాడారు. గురజాడ రచనలలో కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ తదితర రచనల్లోని పలు అంశాలు వివరించారు. ఈనాటి యువత గురజాడను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం శివరామకృష్ణమూర్తిని భారతి సమితి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌బీ ప్రసాదు, ఎం. మాధవరావు, జె. చిరంజీవిరావు, సీహెచ్ రూప, అవిర్నేని వెంకటేశ్వరరావు, కేఎస్ అప్పారావు, ఎల్.శిరీష, లంకా సురేంద్ర, వసుధ బసవేశ్వరరావు, కె. సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మిషన్ శక్తి పథకాన్ని అమలు చేయాలి

మండవల్లి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ శక్తి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటనాగలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. లోకుమూడి సెక్టార్ పరిధిలోని ఇంగిలిపాకలంక జిల్లాపరిషత్ హైస్కూల్లో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కిషోర్ బాలికలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త బీడీపీ జ్యోతి, ఏఎన్ఎం పద్మజ, ఆశ కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైకలూరు: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం చిగురుకోట 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో పోతుమర్రు, మూలలంక సబ్‌స్టేషన్లకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ వినియోగదారుల అదాలత్

కైకలూరు: వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరం (సీజీఆర్ఎఫ్) అదాలత్ బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు గుడివాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ హాజరవుతారని పేర్కొన్నారు. గుడివాడ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలను అదాలత్‌లో తెలియజేయవచ్చని తెలిపారు.

1,205 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు

ముదినేపల్లి రూరల్: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 1,205 మంది ఓటర్లుగా నమోదయ్యారని తహసీల్దార్ సుభాని తెలిపారు. వీరిలో 649 మంది పురుషులు, 556 మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం, స్థానిక జెడ్పీ హైస్కూల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. వచ్చే నెల తొమ్మిదో తేదీ లోపు ఓటు హక్కు కోసం పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేయాలి

మండవల్లి: పాఠశాలలో రాజ్యాంగ పీఠికను నవంబర్ 26 నుంచి వారం రోజుల పాటు విద్యార్థులతో చదివించి, రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేయాలని ప్రొఫెసర్ ఎస్.విజయ్‌కుమార్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు అప్పారావు, ఎంఈఓ–2 రత్నసునానందం అన్నారు. ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పీపీఎస్ఎస్‌జీ ప్రసాద్, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించారు

పెన్షన్ల పంపిణీ నుంచి మినహాయించండి

కైకలూరు: పెన్షన్ పంపిణీ విధుల నుంచి అంగన్‌వాడీ సిబ్బందిని మినహాయించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం కైకలూరు, కలిదిండి ఎంపీడీఓ కార్యాలయాల్లోని అధికారులకు కార్యకర్తలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ, ప్రీ స్కూల్ బాధ్యతలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్క నెల మాత్రమే సహకారం అందించాలని అధికారులు కోరారని, నేడు అనేక అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారని వారు వాపోయారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అబిదాభేగం, రమాదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

గుడివాడ టౌన్: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ విజయా ఫారెన్స్ సోమవారం తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

నేడు ఎన్నికల విధులపై శిక్షణ

ముదినేపల్లి రూరల్ : సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ సుభానీ సోమవారం తెలిపారు. స్థానిక వికన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి ఈ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం –చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వార్షిక షష్టి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉత్సవా లు వచ్చే నెల 6నుంచి 19వరకు కొనసాగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భా గంగా ఆలయ ఆవరణ పరిసర ప్రాంతాల్లో విద్యుద్దీపాలంకరణ పనులు చేస్తున్నారు. ఉత్సవాల ప్రారంభం రోజున 50 వేల మంది మిగిలిన రోజుల్లో 25వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఇందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు.

మహాశివునికి పూజలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయం, నగరేశ్వరాలయం, విన్నకోట భోగేశ్వరాలయం, కౌతవరం గౌతమేశ్వరాలయాల్లో స్వామివార్లకు సోమవారం అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

గుడ్లవల్లేరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. డోకిపర్రులో శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ శిఖర ప్రతిష్ఠ, శ్రీ కోదండ రామాలయ మండప శంకుస్థాపనతో పాటు పుట్టలమ్మ తల్లి ఆలయ మండపాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు వెల్లంకి ఉమాశంకర్, దావులూరి సురేంద్రబాబు, బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విజయం



ఆలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయకుమార్

కైకలూరు: విద్యార్థులు లక్ష్య సాధన దిశగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విజయం వరిస్తుందని ఉమ్మడి కృష్ణా జిల్లా మానవత కెరీర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ సూదా బత్తుల విజయకుమార్ పేర్కొన్నారు. ఆలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆలపాడు, పెంచికలమర్రు, కొల్లేటికోట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కైకలూరు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌లో భాగంగా వివిధ అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ ప్రత్యేకమైన భిన్నమైన ప్రతిభ ఉంటుందన్నారు. దానిని గుర్తించి సరైన కోర్సు సబ్జెక్టును పూర్తి అవగాహనతో ఎంపిక చేసుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. కైకలూరు మానవత స్వచ్ఛంద సంస్థ కో–చైర్మన్ గుర్రం శ్యాంకుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఐక్యతకు కార్తిక వన సమారాధనలు దోహదం



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న గౌడ సంఘం నాయకులు

మండవల్లి: కార్తిక వన సమారాధనలు ప్రజల మధ్య ఐక్యతకు దోహదం చేస్తాయని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని భైరవపట్నం శివారు శోభనాద్రిపురం అగ్రహారం శివాలయ ప్రాంగణంలో నియోజకవర్గ గౌడ సంఘం కార్తిక వన సమారాధన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌడ సంఘం రాష్ట్ర నాయకులు పోసిన చెంచు రామారావు, బొర్రా చలమయ్య అధ్యక్షత వహించారు. తొలుత వన సమారాధన కమిటీ చైర్మన్ పడమటి గణేష్‌బాబు దంపతులు ఉసిరి చెట్టుకు, శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతలు నగదు బహుమతులు అందజేసి సత్కరించారు.

మెరుగైన వైద్యానికి అర్కా ఆస్పత్రి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: అధునాతన పరిజ్ఞానాన్ని పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణకు అందుబాటులోకి తెస్తున్న అర్కా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మెరుగైన సేవలందించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన అర్కా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న పట్టణానికి వసతులు కూడా అవసరమన్నారు. అందులో భాగంగా ఈ ఆస్పత్రి అందుబాటులోకి రావడం శుభపరిణామం అన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ పిన్నమనేని శ్రీరామకృష్ణ ప్రసాద్, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ అజయ్‌రాజు, డాక్టర్ రోహిణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన బాలీవుడ్ నటుడు



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన బాలీవుడ్ నటుడు కబీర్‌బేడీ

గుడ్లవల్లేరు: స్థానిక ఇందిరాకాలనీలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రముఖ బాలీవుడ్ నటుడు కబీర్‌బేడీ సోమవారం ప్రారంభించారు. ఇటలీకి చెందిన కేర్ టు యాక్షన్ సంస్థ వారి రూ.30 లక్షల నిధులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. కార్యక్రమంలో ఇటలీ కేర్ టు యాక్షన్ సంస్థ గ్లోబల్ అంబాసిడర్ రోమినా పవర్, ఆ సంస్థ ప్రతినిధులు రోసారియో జక్కా, టిజియానా స్టాఫోలనీ, పర్వీన్ దుసంజ్, టిజియానా నిన్ని, యారి కారిస్సీ, కార్మెలా లిండా మోండెల్లి, దారియో బియాంచిని తదితరులు పాల్గొన్నారు.